సాక్షి మహబూబాబాద్

గురువారం । 11 । ఏప్రిల్ । 2024



కొండెక్కిన కోడి..
కోడి మాంసం ధర కొండెక్కింది. నెల రోజుల క్రితం వరకు రూ.200 ఉండగా ప్రస్తుతం రూ.294కి చేరింది.
- 8లో▸



విత్తన ఎంపిక నుంచే జాగ్రత్త..
రైతులు ఆర్థిక అభివృద్ధి సాధించాలంటే విత్తన ఎంపిక నుంచే జాగ్రత్త వహించాలని వరంగల్ ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ ఉమారెడ్డి అన్నారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
39.9^0 /21.7^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరం గా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ కాస్త చలి తీవ్రత ఉంటుంది.

తండాల్లో చిదిమేస్తుండ్రు..

మొబైల్ స్కానింగ్ మిషన్‌తో లింగ నిర్ధారణ

- ఆడపిల్ల అని తెలిస్తే అబార్షన్
- రూ.15వేల ప్యాకేజీతో పని పూర్తి
- జిల్లాలో పెరుగుతున్న అబార్షన్ కేసులు
- ఆందోళనకరంగా ఆడపిల్లల నిష్పత్తి



ఇటీవల కురవిలో పట్టుకున్న మొబైల్ స్కానింగ్ మిషన్

సాక్షి, మహబూబాబాద్: ఆధునిక శాస్త్రసాంకేతికత ఆడపిల్లల పాలిట శాపంగా మారింది. ఇప్పటి వరకు గుట్టుచప్పుడు కాకుండా ఆస్పత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేసేవారు. అయితే కొన్ని సందర్భాల్లో పరీక్షల విషయం బయటపడి ఆస్పత్రులను సీజ్ చేసిన ఘటనలు ఉన్నాయి. ఈ క్రమంలో కొత్త కొత్త మిషన్లు అందుబాటులోకి రావడంతో నేరుగా గ్రామాలు, తండాల్లోనే లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ ఆడ, మగ అనే విషయం వెల్లడిస్తున్నారు. ఆడపిల్ల అని తేలితే అక్కడే అబార్షన్ చేస్తూ కుదుర్చుకున్న ప్యాకేజీ ప్రకారం డబ్బులు తీసుకుంటున్నారు. ఇటీవల కురవిలో మొబైల్ స్కానింగ్ మిషన్ ద్వారా లింగనిర్ధారణ పరీక్షలు చేసి పోలీసులకు పట్టుబడటంతో ఈ నయా దందా వెలుగులోకి వచ్చింది. కాగా జిల్లాలో స్త్రీ, పురుషుల నిష్పత్తి 940/1000 ఉన్నట్లు ఇటీవల ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన సర్వేలో తేలింది. ఈ రేషియో భవిష్యత్ తరాలకు ఇబ్బందికరంగా మారుతుందని మహిళా సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

గుట్టుచప్పుడు కాకుండా..

లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారు జిల్లా వ్యాప్తంగా ఏజెంట్లను పెట్టుకొని దందాను నడిపిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇందులో కొందరు ఆర్ఎంపీలు కీలక పాత్ర పోషించి కమీషన్లు తీసుకుంటున్నారని ప్రచారం. జిల్లాలోని మహబూబాబాద్, తొర్రూరు తదితర ప్రాంతాల్లోని స్కానింగ్ సెంటర్లు, మొబైల్ స్కానింగ్ సెంటర్లలో గర్భిణులు లింగ నిర్ధారణ పరీక్షలతో పాటు అబార్షన్లు చేయించుకోవడం పరిపాటిగా మారింది. జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ ఆస్పత్రి సమీపంలో ఉన్న పలు ఆస్పత్రుల్లో ఈ అబార్షన్లు చేస్తున్నారని ప్రచారం. ముందుగా పరీక్షలు నిర్వహించి, ఆడపిల్ల అని తేలితే సదరు ఆస్పత్రుల నిర్వాహకులు, మధ్యవర్తులు రేటు కుదుర్చుకుని సదరు మహిళలను ఆస్పత్రికి తీసుకెళ్లి అబార్షన్లు చేయడం జరుగుతోంది. ఇందుకోసం భద్రాద్రికొత్తగూడెం, సూర్యాపేట, ఖమ్మం జిల్లాలకు చెందిన వారు కూడా మానుకోటకు వస్తున్నారని తెలిసింది. కాగా అధికారులు మాత్రం నామమాత్రంగా తనిఖీలు చేసి చేతులు దుపులుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లకు అడ్డుకట్ట వేయాలని.. ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

మొబైల్ స్కానింగ్ మిషన్ ద్వారా..

ఇప్పటి వరకు కడుపులో ఉన్న బిడ్డ ఆరోగ్య పరిస్థితి, కణతులు, కిడ్నీలో రాళ్లు, ఇతర సమస్యలు తెలుసుకునేందుకు ప్రత్యేకంగా స్కానింగ్ సెంటర్లకు వెళ్లి నిబంధనల మేరకు పరీక్షలు చేయించుకునేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కొత్తగా వచ్చిన మొబైల్ స్కానింగ్ మిషన్లు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఇదే అదునుగా భావించిన కొందరు దర్జాగా ఆమిషన్ల ద్వారా తండాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ భారీగా దండుకుంటున్నారు. నాలుగైదు కేసులు ఉంటే నేరుగా తండాలకు వెళ్తున్నారు. చుట్టు పక్కల తండాల్లోని గర్భిణులను ఒకచోటకు పిలిపించి పరీక్షలు చేస్తున్నారు. గర్భంలోని శిశువు ఆడ, మగ విషయం అక్కడే వెల్లడిస్తున్నారు. ఇలా చేసినందుకు రూ. 5వేలకు పైగా తీసుకుంటున్నట్లు సమాచారం. పరీక్ష తర్వాత మగ శిశువు అయితే గర్భిణిని ఇంటికి పంపుతున్నారు. ఆడ శిశువు అయితే అక్కడే అబార్షన్ చేసి మరో రూ.10వేలు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఇలా చేయడంతో పలువురు గర్భిణులు ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లడం, పెద్ద ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకొని బతికి బయట పడిన ఘటనలు ఉన్నాయని గిరిజనులు చెబుతున్నారు.

శిక్షలు కఠినంగా అమలు చేయాలి



లింగనిర్ధారణ పరీక్షలు, అబార్షన్లకు మానుకోట కేంద్ర బిందువు కావడం బాధాకరం. కొందరు స్కానింగ్ సెంటర్ల యజమానులు, డాక్టర్లు అబార్షన్లు చేస్తున్న విషయం తెలిసినా అధికారులు పట్టించుకోరు. ప్రత్యేక టీమ్ వేయాలి. దొరికిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.
– ఫాతిమా, మహిళా సంఘం నాయకురాలు

పర్యవేక్షణ పెంచుతున్నాం..



ఇటీవల కురవిలో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ పలువురు పట్టుబడిన విషయం చూస్తే.. మానవ మనుగడకు వినియోగించే సైన్స్ చిన్నారులను చిదిమేసేందుకు వాడుతున్నారని అర్థమవుతుంది. జిల్లాలో ఆడపిల్లల నిష్పత్తి ఆందోళనకరంగా ఉంది. లింగనిర్ధారణ పరీక్షలపై ప్రత్యేక నిఘా పెట్టాం. ఇందుకోసం ప్రత్యేక టీమ్ కూడా ఏర్పాటు చేశాం. మరింత పర్యవేక్షణ పెంచుతాం.
– బిందుశ్రీ, ఏఎస్‌సీ ప్రోగ్రాం ఆఫీసర్, మహబూబాబాద్

ఈద్గా మైదానం ముస్తాబు



రంజాన్ ప్రార్థనలకు ముస్తాబైన ఈద్గా మైదానం

మహబూబాబాద్ రూరల్: రంజాన్ వేడుకలను జిల్లా కేంద్రం పాత బజారులోని ఈద్గా మైదానం ముస్తాబైంది. గురువారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేయనుండగా.. బుధవారం సాయంత్రం ఈద్గా మైదానాన్ని ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా ఈద్గా కమిటీ అధ్యక్షుడు అసద్ అలీఖాన్ మాట్లాడుతూ.. ఉదయం 9గంటలకు ప్రార్థనలు ప్రారంభం అవుతాయని తెలిపారు. ముస్లిం మత పెద్ద మౌలానా మహ్మద్ సయీద్ అహ్మద్ రిజ్వీ రంజాన్ సందేశం ఇస్తారన్నారు. వేసవికాలం ఎండలను దృష్టిలో ఉంచుకుని చల్లని టెంట్లు వేయించామని తెలిపారు.

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు

- జిల్లా తూనికలు, కొలతలశాఖ అధికారి విజయ్‌కుమార్
- వ్యాపారుల ధాన్యం తూకాల్లో మోసంపై విచారణ

సాక్షి ఎఫెక్ట్



ధాన్యం బస్తా తూకాన్ని పరిశీలిస్తున్న విజయ్‌కుమార్

మరిపెడ రూరల్: రైతులను మోసం చేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా తూనికలు, కొలతల అధికారి విజయ్‌కుమార్ హెచ్చరించారు. వ్యాపారులు పాత పద్ధతిలో తూకాలు పెట్టి క్వింటాకు 5 నుంచి 6కిలోల వరకు అదనంగా దండుకుంటున్నారు. ఈమేరకు బుధవారం సాక్షి దినపత్రికలో 'తూకంలో మోసం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారి స్పందించారు. మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం వ్యవసాయ క్షేత్రాల్లో వ్యాపారులు కొనుగోలు చేపట్టిన ధాన్యం తూకాల మోసంపై విచారణ చేపట్టారు. రైతు గునిగంటి వెంకన్న వ్యాపారికి ధాన్యం కాంటా పెడుతుండగా.. తునికల కొలతల అధికారి ఎలక్ట్రానిక్ కాంటాను పరిశీలించారు. తూకం చేసిన ధాన్యం బస్తాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత పద్ధతి కాంటా తూకంలో వ్యత్యాసం వచ్చి రైతులు మోసపోవడం జరుగుతుందన్నారు. ఎలక్ట్రానిక్ కాంటాల ద్వారా మాత్రమే బస్తాలు తూకం వేసి కొనుగోలు చేయాలని వ్యాపారులను హెచ్చరించారు. ప్రభుత్వం మద్దతు ధర కల్పించి ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్ముకోవాలని రైతులకు సూచించారు.

అబ్బే.. అప్పుడే ఎందుకులే

ప్రచారానికి జనంలోకి వెళ్లేందుకు జంకుతున్న నేతలు..

- టికెట్లు ఖరారు చేసుకునే వరకు దూకుడు
- ప్రకటన తర్వాత చల్లబడ్డ అభ్యర్థులు
- నోటిఫికేషన్ విడుదలకు మరో వారం రోజులు
- ఆ తర్వాతే రంగంలోకి నేతలు, అభ్యర్థులు



సాక్షిప్రతినిధి, వరంగల్: ఉమ్మడి వరంగల్‌లో పార్లమెంట్ ఎన్నికల సందడి కనిపించడం లేదు. అభ్యర్థిత్వం ఖరారు అయ్యే వరకు హడావుడి చేసిన అభ్యర్థులు, నాయకులు ఆ తర్వాత చల్లబడ్డారు. మార్చి మొదటి వారంలో వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి టికెట్ ఆశించే వారు నానా హంగామా, హడావుడి చేశారు. మహబూబాబాద్ లోక్‌సభకు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తమ అభ్యర్థులుగా పోరిక బలరాంనాయక్, అజ్మీరా సీతారాం నాయక్, మాలోతు కవితను ప్రకటించాయి. వరంగల్ పార్లమెంట్‌కు బీజేపీ.. మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌ను అభ్యర్థిగా ఎంపిక చేయగా.. బీఆర్ఎస్ మొదట కడియం శ్రీహరి కూతురు కడియం కావ్యకు అవకాశం ఇచ్చింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విషయంలో తర్జన భర్జన పడుతున్న సమయంలో కడియం శ్రీహరి, కావ్య బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీ అభ్యర్థి కావ్య అయ్యారు. బీఆర్ఎస్ ఇంకా అభ్యర్థి విషయంలో మల్లగుల్లాలు పడుతుండగా.. అభ్యర్థులను ప్రకటించిన పార్టీలు ప్రచారానికి జనంలోకి వెళ్లేందుకు జంకుతున్నాయి. నోటిఫికేషన్ విడుదలకు మరో వారం రోజులు గడువు ఉండగా.. ఇంత ముందుగా ప్రచారం మొదలుపెడితే ఖర్చు తడిసి మోపెడు అవుతుందన్న భావనతో అభ్యర్థులు ఆచితూచి వ్యవహరిస్తున్నారన్న చర్చ అన్నీ పార్టీల నాయకులు, కార్యకర్తల్లో సాగుతోంది.

ఏదీ.. జోష్..

2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోటాపోటీగా ప్రచారాలతో హోరెత్తించారు. లోక్‌సభ ఎన్నికలకు వచ్చేసరికి ఆ జోరు ఏ పార్టీలోనూ కనిపించడం లేదు. 2023 అక్టోబర్ 9న షెడ్యూల్, నవంబర్ 3న నోటిఫికేషన్‌లు వచ్చాయి. 15న నామినేషన్ల ఉప సంహరణ నుంచి పోలింగ్ తేదీ నవంబర్ 30 వరకు.. నోటిఫికేషన్‌కు 15 రోజుల ముందు నుంచి ప్రచారాన్ని అన్ని పార్టీలు హోరెత్తించాయి. ప్రధాన పార్టీల వ్యూహప్రతివ్యూహాలతో రాజకీయం వేడెక్కింది. లోక్‌సభ ఎన్నికలకు వచ్చేసరికి ఆ జోరు ఏ పార్టీలోనూ కనిపించడం లేదు. పోలింగ్‌కు గడువు ఇంకా 33 రోజులే ఉన్నా ప్రధాన పార్టీలు ప్రచారంలో దూకుడు ప్రదర్శించడం లేదు. అటు ఇటుగా పార్టీల మారిన నాయకులు, అభ్యర్థులు ముఖ్య నేతలను కలిసి ప్యాచప్ చేసుకుంటున్నారే గానీ ప్రజల్లోకి ప్రచారం చేస్తున్న దాఖలాలు లేవు. ఇంకొందరు హంగు ఆర్భాటాలకు పోకుండా కేవలం అనుచరులతో కలిసి తిరుగుతున్నారు. ఇంకా అసెంబ్లీ నియోజకవర్గాల్లో పూర్తి స్థాయిలో ప్రచారాన్ని మొదలు పెట్టలేదు. దీంతో ఎన్నికల వాతావరణం కనిపించడం లేదు. నోటిఫికేషన్ వచ్చిన తరువాతే రంగంలోకి దిగాలనే భావనలో ప్రధాన పార్టీ అగ్రనేతలున్నట్లుగా అభ్యర్థులు కొందరు కేడర్‌కు వివరిస్తున్నట్లు సమాచారం. కాగా పోలింగ్‌కు ఇంకా సమయం ఉండటంతో ఇప్పటినుంచే వందలాది మంది కార్యకర్తలతో ప్రచారం చేస్తే ఖర్చులు తడిసి మోపెడవుతాయని వెనకడుగు వేస్తున్నారన్న చర్చ కూడ తెరచాటున జరుగుతోంది.

వ్యూహ రచనల్లోనే ప్రధాన పార్టీలు..

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రధాన పార్టీలు వ్యూహరచనల్లో నిమగ్నమై ఉన్నాయి.

- కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లోనూ సత్తా చాటాలనుకుంటోంది. ఈ నెల 6న ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరైన తుక్కుగూడ జన జాతర సభను ప్రతిష్టాత్మకంగా నిర్వహించి మేనిఫెస్టోను విడుదల చేసింది. వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలకు బలరాం నాయక్, కడియం కావ్య అభ్యర్థులుగా ఖరారు కాగా.. గెలుపే లక్ష్యంగా ఇటీవల హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు సమీక్షలు నిర్వహించారు.
- బీఆర్ఎస్ పార్టీ మహబూబాబాద్ అభ్యర్థిగా మాలోతు కవితనే ప్రకటించగా.. వరంగల్ అభ్యర్థి కడియం కావ్య పార్టీ మారడంతో మరో అభ్యర్థి విషయంలో ఇంకా కసరత్తు చేస్తోంది. కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్ వేర్వేరుగా ఉమ్మడి వరంగల్ నేతలతో ఇప్పటికే మూడు పర్యాయాలు కీలక భేటీలు నిర్వహించారు. అభ్యర్థులు సైతం ఇంటింటి ప్రచారం నిర్వహించాలని ఇటీవల ఆదేశించిన అధిష్టానం.. పునర్వైభవం కోసం వ్యూహరచనలో మునిగింది.
- భారతీయ జనతా పార్టీ మహబూబాబాద్ అభ్యర్థిగా మాజీ ఎంపీ సీతారాం నాయక్, వరంగల్‌కు వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌కు చాన్స్ ఇచ్చింది. ఇప్పటికే కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర చీఫ్ కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ అగ్రనేతలు సమన్వయ సమావేశాలు, బైఠక్‌లు నిర్వహించారు. అభ్యర్థులు నాయకులు, ముఖ్య నేతలను కలుస్తున్నా.. నోటిఫికేషన్ తర్వాతే ప్రచారాన్ని హోరెత్తించే వ్యూహంలో ఆ పార్టీ నేతలున్నట్లు చెబుతున్నారు.

దాహార్తి తీర్చేందుకు..

మున్సిపాలిటీలు, గ్రామాల్లో చలివేంద్రాలు

- జిల్లాలో ఇప్పటి వరకు 100కు పైగా ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



కేసముద్రం స్టేషన్ జీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం (ఫైల్)

మహబూబాబాద్: జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. దీంతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మున్సిపాలిటీలు, గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశాలతో ఏర్పాటు చేస్తుండగా.. సిబ్బంది నిర్వహణ బాధ్యతలు చేపడుతున్నారు. చలివేంద్రాల ఏర్పాటుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకొని ఎక్కువ సంఖ్యలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించినా.. అధికారులు వారితో కనీసం సమావేశాలు కూడా నిర్వహించలేదు.

100కు పైగా..

జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు, 461 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతి మున్సిపాలిటీలో కనీస మూడు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు ఉన్నాయి. ఎక్కువగా రద్దీ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. మానుకోట, తొర్రూరు, డోర్నకల్, మరిపెడ మున్సిపాలిటీలతో పాటు, గ్రామ పంచాయతీల్లో ఇప్పటి వరకు 100కు పైగా చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు.

ఉదయం నుంచి సాయంత్రం వరకు..

ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు చలివేంద్రాల నిర్వహణ చేపట్టాలని సిబ్బందికి విధులు కేటాయించారు. మిషన్‌భగీరథ నీరుతో చలివేంద్రాల నిర్వహణ చేపడుతున్నారు. పనుల నిమిత్తం మున్సిపాలిటీలు, మండల కేంద్రాలకు వచ్చే ప్రజలకు ప్రస్తుతం ఏర్పాటు చేసిన చలివేంద్రాల్లోని తాగునీరు సరిపోవడం లేదు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. అయితే ఆదిశగా అధికారులు ప్రయత్నించడం లేదు. దీంతో ప్రజలు వాటర్ బాటిళ్లు కొనుగోలు చేసి తాగాల్సిన పరిస్థితి నెలకొంది.

మానుకోటలో నిర్వహణ అంతంత మాత్రమే..

మానుకోట మున్సిపాలిటీలో ఇటీవల చలి వేంద్రాలు ఏర్పాటు చేయగా.. నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ నెల 4న కూరగాయల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన చలి వేంద్రంలో నీరు అయిపోవడంతో మధ్యాహ్నం 3గంటలలోపే బంద్ చేశారు. దీంతో దాహార్తిని ఎలా తీరుస్తారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు సాయంత్రం 5గంటల వరకు నీరు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మూడు చలివేంద్రాలు ఏర్పాటు చేశాం

మానుకోట పట్టణంలో కలెక్టర్ ఆదేశాలతో మూడు చలి వేంద్రాలు ఏర్పాటు చేశాం. సిబ్బందికి విధులు కేటాయించాం. సాయంత్రం 5గంటల వరకు సరిపోను నీరు ఉంచుతున్నాం. కుండల్లోని మిషన్ భగీరథ నీటిని ప్రజలు తాగుతున్నారు.
– నోముల రవీందర్, మానుకోట మున్సిపల్ కమిషనర్

జీపీల్లో ఏర్పాటు చేశాం

జిల్లాలో 461జీపీలు ఉండగా, ఇప్పటి వరకు 80పైగా చలివేంద్రాలు ఏర్పాటు చేశాం. మొదట పెద్ద జీపీలు, మండల కేంద్రాల్లో ఒకటి చొప్పున ఏర్పాటు చేస్తున్నాం. తాగునీటి విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాం. వడదెబ్బ విషయంలో గ్రామాల్లో టాంటాం వేయించాం.
– హరిప్రసాద్, డీపీఓ

చలివేంద్రాలు ఉపయోగపడుతున్నాయి..



పనుల మీద మానుకోటకు వచ్చే వారికి చలి వేంద్రాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. దాహార్తిని తీరుస్తున్నాయి. చల్లని నీటిని పోస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం 6గంటల వరకు చలివేంద్రాల్లో తాగునీరు ఉండేలా చూడాలి.
– సుభద్ర, మానుకోట

పాఠశాలల్లో మరమ్మతులు చేయించాలి

- వీసీలో సీఎస్ శాంతికుమారి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులు

మహబూబాబాద్: పాఠశాలల్లో మరమ్మతు పనులు చేయించాలని సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి ఆమె అన్ని జిల్లాల కలెక్టర్లతో తాగునీటి సరఫరా, పాఠశాలల మరమ్మతులు, సమ్మర్ యాక్షన్ ప్లాన్, ధాన్యం కొనుగోలు, సీఎంఆర్ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ..తాగునీటి స మస్య తలెత్తకుండా యాక్షన్ ప్లాన్‌తో ముందుకెళ్లాలన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సంబధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రత్యామ్నాయ వనరులపై దృష్టి పెట్టా లన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పా ట్లు చేసి రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. సీఎంఆర్ లక్ష్యాలు వెంటనే పూర్తి చేయించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలోపు పాఠశాలల్లో అత్యవసర పనులు పూర్తి చేయించాలన్నారు. వీసీలో అదనపు కలెక్టర్లు డేవిడ్, లెనిన్ వత్సల్ టొప్పో, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు పోటెత్తిన మక్కలు



మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మక్కలు

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం మక్కలు పోటెత్తాయి. వరుసగా సెలవులు రావడంతో ఒక్కసారిగా 16,288 బస్తాల మక్కలు అమ్మకానికి వచ్చాయి. ఈ సీజన్‌లో ఎన్నడూ లేనివిధంగా మక్కలు అమ్మకానికి రావడంతో షెడ్లన్నీ నిండిపోయి, ఓపెన్ యార్డుల్లోనూ పోసుకున్నారు. అధికంగా మక్కలు రావడంతో టెండర్లు ఆలస్యమై సాయంత్రం కాంటాలు పెట్టారు. రాత్రి వరకు తొలకాలు కొనసాగాయి. అప్పటి వరకు రైతులకు పడిగాపులు తప్పలేదు. క్వింటా మక్కలకు గరిష్ట ధర రూ.2,217, కనిష్ట ధర రూ.2,069 పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

పండ్ల తోటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి



మహబూబాబాద్: వేసవికాలంలో ఆయిల్ పామ్, పండ్ల తోటల విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం పండ్ల తోటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 6,844 ఎకరాల్లో రైతులు ఆయిల్ పామ్‌తోటలు సాగు చేస్తున్నారన్నారు. ఏప్రిల్, మే మాసాల్లో ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని దిగుబడి సాధించేందుకు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

నర్సింహులపేట: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని డీపీఓ హరిప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని బాసుతండాలో సందర్శించి నీటి ఎద్దడిని పరిశీలించారు. నిధులు వెచ్చించి నీటి సమస్య తీర్చాలన్నారు. నీటి సమస్య విషయంలో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఈ కృష్ణారెడ్డి, ఏఈలు వెంకటేశ్వరరెడ్డి, రాకేష్, ఎంపీఓ సోమ్‌లాల్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు తప్పనిసరి

- మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్



మహబూబాబాద్: ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు తప్పనిసరిగా నిర్మించుకోవాలని మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్ అన్నారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం ఇంకుడుగుంతల నిర్మాణంపై ఇళ్లు, ఇంటి స్థలాల యజమానులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో 300 చదరపు మీటర్ల కంటే ఎక్కువ స్థలంలో ప్రస్తుతం గృహ నిర్మాణం చేపట్టేవారు, గృహాల్లో నివాసం ఉంటున్నవారు తప్పని సరిగా ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టాలరు. వర్షపు నీరు వృథా కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, భూగర్భ జలాలు పెంచేందుకు ప్రజలు సహకరించాలన్నారు. సమావేశంలో టీపీఓ నవీన్, మేనేజర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు

మహబూబాబాద్ రూరల్: మానుకోట వ్యవసాయ మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు ప్రకటించామని ఏఎంసీ సెక్రటరీ షంషీర్ బుధవారం తెలిపారు. రంజాన్ పండుగ సందర్భంగా గురు, శుక్రవారం ప్రభుత్వ సెలవులు ఉన్నాయని, శని, ఆదివారాలు వారాంతపు సెలవులని పేర్కొన్నారు. సోమవారం నుంచి క్రయ విక్రయాలు జరుగుతాయని తెలిపారు. రైతులు, గుమాస్తాలు, దడవాయిలు, కూలీలు ఈ విషయాన్ని గమనించి సహకరించగలరని ఆయన కోరారు. అలాగే కేసముద్రం మార్కెట్‌కు సైతం సెలవులు ప్రకటించారు.

విద్యార్థులు సబ్జెక్టులపై పట్టు సాధించాలి



గంగారం: విద్యార్థులు సబ్జెక్టులపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీటీడీఓ ఎర్రయ్య అన్నారు. మండలంలోని గంగారం, మడగూడెం, కామారం, కాటినాగారం ఆశ్రమోన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, భోజనశాలలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థుల విషయ పరిజ్ఞానాన్ని పరీక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళలకు ఉచిత శిక్షణ

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని సంస్కృతీవిహార్‌లోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మేనేజర్ బాస రవి తెలిపారు. ఉమెన్స్ టైలర్ (39రోజులు), బ్యూటీ పార్లర్ (30 రోజులు) రంగాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, ములుగు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులన్నారు. 18 నుంచి 45 ఏళ్ల వయసు, తెల్ల రేషన్ కార్డు, ఆధార్‌కార్డు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల వారు నాలుగు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్, రేషన్‌కార్డుల ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హత జిరాక్స్ పత్రాలతో సంస్కృతీవిహార్, హసన్‌పర్తిలో ఈనెల 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు 9704056522 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

వడదెబ్బతో ఒకరి మృతి


రన్యా (ఫైల్)

నర్సంపేట రూరల్ : వడదెబ్బతో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన బుధవారం నర్సంపేట మండలం ముగ్ధుంపురంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాదావత్ రన్యా (56) మహేశ్వరం శివారులోని తన మొక్కజొన్న చేనుకు కాపాలా వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాగానే తీవ్ర జ్వరం, అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య సారమ్మ, కుమారుడు శ్రీధర్, కుమార్తె ఉన్నారు. కాగా, రన్యాకు ఎంపీటీసీ చీకటి స్వరూప, చెన్నారావుపేట సొసైటీ డైరెక్టర్ ఇస్లావత్ గోపినాయక్, మాజీ సర్పంచ్ రాకేష్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ చాందావత్ తిరుపతినాయక్ నివాళులర్పించారు.

కొండెక్కిన కోడి..



కిలో చికెన్ ధర రూ.294
- బెంబేలెత్తుతున్న వినియోగదారులు
- కోళ్ల పెంపకంపై ఎండల ప్రభావం
- తాత్కాలిక విరామం పాటిస్తున్న నిర్వాహకులు


తొర్రూరులో చికెన్ కొడుతున్న నిర్వాహకుడు

తొర్రూరు: కోడి మాంసం ధర కొండెక్కింది. నెల రోజుల క్రితం వరకు రూ.200 ఉండగా ప్రస్తుతం రూ.294కి చేరింది. దీంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. గతంలో కిలో తీసుకునే వారు ప్రస్తుతం ఈ ధరను చూసి అర కిలోకే పరిమితమవుతున్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే మాంసం వినియోగం అధికంగా ఉంది. ఉమ్మడి జిల్లాలో 450 కోళ్ల (బాయిలర్) ఫాంలు ఉన్నాయి. వీటి ద్వారా రోజూ సగటున లక్ష నుంచి లక్షన్నర కిలోల వరకు మాంసం విక్రయాలు జరుగుతున్నాయి.

ఎండల ప్రభావం..

ఎండలు ఈ సారి మండిపోతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. ఫలితంగా కూరగాయల తోటలతో పాటు కోళ్ల పెంపకాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. సాధారణంగా బ్రాయిలర్ కోళ్లు 35 నుంచి 40 రోజుల్లో 2.5 కిలోల వరకు పెరుగుతాయి. ఎండ తీవ్రత, ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో వీటి ఎదుగుదల తక్కువగా ఉండడం, మృత్యువాత పడుతుండడంతో పరిశ్రమ నిర్వాహకులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉక్కపోత నుంచి రక్షణ కోసం కూలర్లు ఏర్పాటు చేసినా ప్రయోజనం లేకపోవడంతో నిర్వాహకులు కోళ్ల పెంపకానికి తాత్కాలిక విరామం పాటిస్తున్నారు. దీంతో కొరత ఏర్పడి కోళ్ల ధరలు పెరిగాయి.


చేపలపై ఆసక్తి..

రోజురోజుకూ పెరుగుతున్న చికెన్ ధరను చూసి బెంబేలెత్తుతున్న మాంసం ప్రియులు చేపలపై ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు పట్టణాల్లో, మండల కేంద్రాల్లో ఎక్కడ చూసినా రహదారుల వెంట చేపల విక్రయదారులే కనిపిస్తున్నారు. స్థానికంగా చెరువుల వద్ద కిలో రూ.100, పట్టణాల్లో కిలో రూ.150కి విక్రయిస్తున్నారు. చికెన్‌కు వెచ్చించే ధర చూస్తే చేపలు రెండు కిలోల వరకు వస్తుండడంతో వీటిని తినడానికి వినియోగదారులు ఇష్టపడుతున్నారు.

ఈనెలలో చికెన్ ధరల వివరాలు

తేదీ	స్కిన్‌లెస్	స్కిన్
10	రూ.294	రూ.258
9	రూ.294	రూ.258
8	రూ.294	రూ.258
7	రూ.294	రూ.258
6	రూ.290	రూ.255
5	రూ.266	రూ.233
4	రూ.266	రూ.233

ఇక.. రైళ్ల ట్రాఫిక్ క్లియర్


రైల్వే సొరంగ మార్గం


కింద నిర్మించిన రైల్వే ట్రాక్


పైన నిర్మించిన రెండు రైల్వే ట్రాక్‌లు

కాజీపేట-హసన్‌పర్తి మధ్య రైల్వే సొరంగ మార్గం నిర్మాణం
- త్వరలో అధికారిక ప్రారంభానికి శ్రీకారం
- దక్షిణ మధ్య రైల్వేలో ఇదే మొదటి మార్గం

కాజీపేట రూరల్ : ఇక.. రైళ్ల ట్రాఫిక్ క్లియర్ కానుంది. కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని కాజీపేట టౌన్ -హసన్‌పర్తి రైల్వే స్టేషన్‌ల మధ్య రైల్వే శాఖ సుమారు 4 కిలోమీటర్ల మేర రైల్ అండర్ రైల్ బ్రిడ్జి (సొరంగ మార్గం గుండా రైల్వే ట్రాక్, పైనకూడా ట్రాక్)నిర్మాణం చేపట్టింది. న్యూఢిల్లీ-విజయవాడ, హైదరాబాద్ రైలు మార్గాలను కలుపుతూ వెళ్లే ఈ రూట్‌లో రైల్వే శాఖ.. దక్షిణ మధ్య రైల్వేలో మొదటిసారి 2021 సంవత్సరంలో రైల్ అండర్ రైల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టింది. మూడు సంవత్సరాలు కొనసాగిన ఈ బ్రిడ్జి నిర్మాణం.. పనులు పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈ ప్రాంతంలో రైల్వే ట్రాక్ నిర్మాణ పనులకు విద్యుత్ సబ్ స్టేషన్‌తో పాటు వడ్డేపల్లి చెరువు అడ్డు రావడంతో ఈ మార్గం గుండా రైల్ మార్గం వేయాలంటే కోట్లాది రూపాయిలు ఖర్చు చేయాల్సి ఉంటుందని రైల్వే అధికారులు తెలిపారు. అయితే దీనికి భిన్నంగా తక్కువ వ్యయంతో ఎలాంటి సాంకేతికపర ఇబ్బందులు తలెత్తకుండా రైల్ అండర్ రైల్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టి సక్సెస్ అయ్యారు. రైల్ అండర్ రైల్ నిర్మాణంలో భాగంగా కింద మార్గన రైల్వే ట్రాక్, పై మార్గాన రెండు రైల్వే ట్రాక్‌ల నిర్మాణం చేపట్టారు. పక్కన నుంచి మూడో రైల్వే లైన్ మార్గం, అదేవిధంగా బైపాస్ లైన్ మీదుగా నాలుగో రైల్వే లైన్ నిర్మాణం కూడా వెళ్తుంది. కాగా, రైల్ అండర్ రైల్ బ్రిడ్జిని నిర్మించిన అధికారులు.. ట్రయల్ రన్ చేయనున్నారు. అన్ని విధాలా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టిన అనంతరం రైల్వే శాఖ ట్రాక్ పిట్ సర్టిఫికెట్ ఇవ్వనుంది. అనంతరం త్వరలో అధికారికంగా ప్రారంభించి ఈ రైల్ అండర్ రైల్ బ్రిడ్జిని వినియోగంలోకి తీసుకురానున్నారు. ఫలితంగా ఈ మార్గంలో రైళ్ల ట్రాఫిక్ క్లియర్ కావడంతో పాటు గూడ్స్, ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలకు ఎలాంటి అంతరాయం ఉండదని రైల్వే అధికారులు తెలిపారు.

భారత్.. విభిన్న సంస్కృతుల నిలయం

- విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారులు శ్రీనివాస్, సారయ్య


పోటీలు నిర్వహిస్తున్న విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారులు శ్రీనివాస్, సారయ్య

మామునూరు: భారతదేశం విభిన్న సంస్కృతులకు నిలయమని జనగామ, వరంగల్ జిల్లాల విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారులు బొమ్మనబోయిన శ్రీనివాస్, మాలోత్ సారయ్య అన్నారు. బుధవారం ఖిలా వరంగల్ మండలం మామునూరు జవహర్ నవోదయ విద్యాలయంలో జనగామ, వరంగల్ జిల్లాల విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థాయి ప్రేరణ ఉత్సవ్ పోటీలు జరిగాయి. వారు ముఖ్యఅతిథులుగా హాజరై నోడల్ అధికారి జేఎన్‌వీ పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ హరిలాల్‌తో కలిసి పోటీలు ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. కాగా, రెండు జిల్లాల నుంచి మొత్తం 243 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యాస రచన, డ్రాయింగ్, పాటలు, పద్యాలు, కార్టూన్స్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈపోటీల్లో ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన 15 మంది బాలికలు , 15 మంది బాలురలను ఎంపిక చేశారు.

ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు 12వరకు గడువు

విద్యారణ్యపురి: 2024-2025 విద్యాసంవత్సరానికి సంబంధించి మహాత్మాజ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 12వ తేదీ వరకు గడువు ఉందని ఎంజేపీటీబీసీ డబ్ల్యూఆర్ ఉమ్మడి వరంగల్ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ మనోహర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 15 బాలుర, 14 బాలికల గురుకుల జూనియర్ కళాశాలలున్నాయి. మూడు బాలికల, మూడు బాలుర గురుకుల డిగ్రీ కళాశాలలున్నాయి. ఈ ప్రవేశపరీక్ష ఈనెల 28న నిర్వహించబోతున్నారని ఆయన తెలిపారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ


మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

హన్మకొండ: రాష్ట్రంలో మాదిగ కులస్తులను రాజకీయంగా అణిచివేస్తున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని, త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో మాదిగ లాయర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎంఎల్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు వి.వి.వెంకటరత్నం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ కేవలం మాలలకు కొమ్ముకాస్తూ మాదిగలను రాజకీయంగా అణచివేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ.. వరంగల్ పార్లమెంట్ స్థానంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు టికెట్ ఇవ్వకుండా పూటకో పార్టీ మార్చి మాదిగల పదవులు దోచుకుంటున్న కక్కుర్తి పరుడు కడియం శ్రీహరి కూతురుకు టికెట్ ఇచ్చిందన్నారు. ఇది మాదిగల ఉనికిని దెబ్బతీసే కుట్ర అన్నారు. ఈ కుట్రలను మాదిగలంతా ఏకమై ఓటు రూపంలో తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. మాదిగ బిడ్డ, బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో హనుమకొండ బార్ ప్రెసిడెంట్ మాతంగి రమేష్ బాబు, స్పోర్ట్స్ సెక్రటరీ సెక్రటరీ పి.చిరంజీవి వరంగల్ సెక్రటరీ గోపిక రాణి, మాదిగ లాయర్స్ ఫెడరేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొంగర పూర్ణచందర్, హనుమకొండ అధ్యక్షుడు గోవిందు నాగభూషణం, అధికార ప్రతినిధి మంద సుభాష్, వరంగల్ జనరల్ సెక్రటరీ అనిల్ కుమార్, రాష్ట్ర కోఆర్డినేటర్ అమృతరావు, తదితరులు పాల్గొన్నారు.

లంబాడీలు అస్థిత్వ పోరాటాలకు సిద్ధం కావాలి

- ప్రొఫెసర్ జిలకర శ్రీనివాస్


మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీనివాస్

హన్మకొండ: లంబాడీ కులస్తులు అస్థిత్వ పోరాటాలకు సిద్ధం కావాలని ప్రొఫెసర్ జిలుకర శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ అశోక కాలనీలోని గిరిజన భవన్‌లో లంబాడీ హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో సంఘం రాష్ట్ర ప్లీనరీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు భూమి కోసం, భుక్తి కోసం, మాతృదేశ విముక్తి కోసం చేపట్టిన సాయుధ పోరాటంలో దొరలను తరిమికొట్టిన వీరుడు, లంబాడీ బిడ్డ ఠానూనాయక్ అన్నారు. ప్రస్తుతం దేశంలో పాలన కొనసాగిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపకపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల బిడ్డలు బానిసలుగా బతికే రోజులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు భీమానాయక్ మాట్లాడుతూ లంబాడీ వ్యతిరేక ప్రభుత్వాలకు లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధి చెబుతామన్నారు. అనంతరం రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుగులోత్ భీమానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హనుమకొండకు చెందిన అజ్మీరా వెంకట్ నాయక్ ఎన్నికయ్యారు. 22 మందితో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. అజ్మీరా వెంకట్ నాయక్, సురేష్ బాబు జాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో భారత్ బచావో జాతీయ నాయకుడు జై సింగ్ రాథోడ్, రాష్ట్ర నాయకుడు వెంగల్ రెడ్డి, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు వీరన్న నాయక్, ఎన్ఐటీ పరిశోధక విద్యార్థి అంగోత్ లోక్ నాయక్, నాయకులు సమ్మయ్య రాథోడ్, బానోత్ రామన్న నాయక్, తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత..

- శరీరదానానికి ముందుకొచ్చిన వృద్ధురాలు
- అంగీకార పత్రం అందజేత


అంగీకారపత్రం అందజేస్తున్న బచ్చమ్మ,కుటుంబీకులు

కురవి : మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు పెండెం బచ్చమ్మ మరణానంతరం తన పార్థివదేహాన్ని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అందించేందుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు బుధవారం నేత్ర అవయవ, శరీరదాతల సంఘం జిల్లా కన్వీనర్ పర్కాల రవీందర్‌రెడ్డికి బచ్చమ్మ అంగీకారపత్రం అందజేసింది. బచ్చమ్మను స్ఫూర్తిగా తీసుకుని అవయవదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని రవీందర్‌రెడ్డి ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకుడు ఎర్ర నాగేశ్వర్‌రావు, రిటైర్డ్ ఉద్యోగి బాదె వెంకన్న, దాత కుటుంబ సభ్యులు గుంటి శశిరేఖ, శ్రీహరి, సురేష్, గజ్జెల కల్యాణ్, చెల్ల కిరణ్ పాల్గొన్నారు.

మిత్రుడి వద్దకు వెళ్తూ..అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో స్నేహితుల దుర్మరణం
- హనుమకొండ సుబేదారి ప్రాంతంలో ఘటన
- శోకసంద్రంలో మృతుల కుటుంబీకులు


సయ్యద్ ఆస్రాఫ్ హుస్సేన్, సయ్యద్ వహీద్ అలీ (ఫైల్)

కాజీపేట : చేతికి అందివచ్చిన కుమారులు తమకు అండగా ఉంటారని భావించిన తల్లిదండ్రుల ఆశలను మృత్యువు చిదిమేసింది. హనుమకొండ సుబేదారి ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులను బలితీసుకుని కన్నవారికి పుట్టెడు దుఃఖం మిగిల్చింది. రోడ్డు ప్రమాద రూపంలో ప్రాణస్నేహితులను అమాంతం మింగి రెండు ఇళ్లలో తీవ్ర విషాదం నింపింది. వివరాల్లోకి వెళ్తే.. కాజీపేటకు చెందిన సయ్యద్ అస్రాఫ్ హుస్సేన్ (23), సయ్యద్ వహీద్ అలీ (22) ప్రాణ స్నేహితులు. ఒకరిని విడిచి మరొకరు ఉండేవారు కాదు. ఈ క్రమంలో రంజాన్ మాసం కావడంతో మంగళవారం రాత్రి ఒకే ప్రాంతంలో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం మరో మిత్రుడు ఫోన్ చేయడంతో ద్విచక్రవాహనంపై హనుమకొండ వైపునకు బయలుదేరారు. ఈ క్రమంలో సుబేదారి ప్రాంతంలో కారును ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. దీనిపై సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, బంధు, మిత్రులు హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకున్నారు. రహదారిపై విగత జీవులుగా పడి ఉన్న మిత్రులను చూసి దిక్కులు పిక్కటిల్లేలా రోదించారు. కాగా, ట్రాఫిక్ సీఐ నాగబాబుతో పాటు సుబేదారి పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

మంగలపల్లిలో వృద్ధుడు..


కరీం మృతదేహం

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం మంగలపల్లిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన సయ్యద్ కరీం(60) తన ద్విచక్రవాహనం రోడ్డు క్రాస్ క్రమంలో టాటా ఏస్ వాహనం ఢీకొంది. దీంతో కరీం కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని వృద్ధుడిని చికిత్స నిమిత్తం వరంగల్ ఆస్పత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి మార్గమధ్యలో మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు.

కడిపికొండ ఆర్‌ఓబీపై మరో వృద్ధుడు..

మడికొండ : రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం కడిపికొండ ఆర్‌ఓబీపై జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కాజీపేట మండలం కడిపికొండ ఇందిరమ్మ కాలనీకి చెందిన మహ్మద్ బషీరుద్దీన్ (60) పని నిమిత్తం ద్విచక్రవాహనంపై కాజీపేట వైపునకు వస్తున్నాడు. ఈక్రమంలో ఉర్సు గుట్ట నుంచి కాజీపేట వైపున వస్తున్న లారీ.. రైల్వే ఓవర్ బ్రిడ్జి మీద వెనుక నుంచి బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో బషీరుద్దీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న మడికొండ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ తెలిపారు.

మంచినీళ్లు ఇవ్వండని అడిగినందుకు..

కులం పేరుతో దూషిస్తూ పారిశుధ్య కార్మికురాలిపై మహిళ దాడి..
- పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు
- కేసు నమోదు


మాట్లాడుతున్న కమల

పరకాల: 'దాహం వేస్తోంది.. కాస్తా మంచినీళ్లు ఇవ్వండమ్మ ' అని అడిగిన ఓ పారిశుధ్య కార్మికురాలిపై మహిళ దాడికి పాల్పడింది. ఈ ఘటన బుధవారం పరకాలలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పరకాల పశువుల సంత సమీపంలోని వెల్లంపల్లి రోడ్డులో కార్మికురాలు చుక్క కమల పారిశుధ్య పనులు చేపట్టింది. అనంతరం దాహం వేయడంతో సమీపంలోని పల్లెబోయిన రామన్న ఇంటికి వెళ్లి మంచినీళ్లు ఇవ్వండి కోరింది. దీనికి రామన్న కూతురు శశి ఆగ్రహం వ్యక్తం చేస్తూ తమ ఇంట్లోకి ఎందుకు వచ్చావంటూ.. కులం పేరుతో దూషిస్తూ దురుసుగా ప్రవర్తించడమే కాకుండా నల్ల పైపులతో చితకబాదింది. తాను పారిశుద్ధ్య కార్మికురాలినని..మంచినీళ్ల కోసం వచ్చానంటూ చెబుతున్నా పట్టించుకోకుండా దాడికి పాల్పడింది. ఈఘటనలో తీవ్రంగా గాయపడి రక్తస్రావంతో రోడ్డుపై విలపిస్తున్న కమలను సహ సిబ్బంది ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. అనంతరం దాడికి పాల్పడిన మహిళపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, పారిశుద్ధ్య కార్మికురాలిపై దాడి చేసిన మహిళ గతంలో ఓ ఎస్సైతో పాటు బిల్లు కోసం వెళ్లిన పేపర్ బాయ్‌ల పట్ల దురుసుగా ప్రవర్తించి సందర్భాలు ఉన్నాయని పలువురు పేర్కొన్నారు. కాగా, పారిశుద్ధ్య కార్మికురాలు కమలపై దాడికి పాల్పడిన మహిళ శశిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

మహిళ పై కేసు నమోదు..

పరకాల మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికురాలు కమలపై దాడిచేసిన పల్లెబోయిన శశిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ రవిరాజ్ తెలిపారు.

మిర్చి రైతుల కన్నెర్ర..

- ధర తగ్గించారంటూ మార్కెట్ కార్యాలయం ఎదుట ఆందోళన


మార్కెట్‌లో ఆందోళన చేస్తున్న రైతులు

కేసముద్రం: మిర్చి రైతులు కన్నెర్ర చేశారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి ఒక్కసారిగా ధర తగ్గించారంటూ బుధవారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో ఆందోళన చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మార్కెట్‌కు సుమారు 500 బస్తాల మిర్చి అమ్మకానికి వచ్చింది. ఈ మేరకు వ్యాపారులు టెండర్‌లు వేయగా, మధ్యాహ్నం తర్వాత విన్నర్ లిస్టు విడుదలైంది. దీంతో తేజారకం మిర్చి క్వింటాకు గరిష్ఠ ధర రూ.15,568, కనిష్ఠ ధర రూ.8,811 పలికింది. తాలురకం మిర్చి క్వింటాకు గరిష్ఠ ధర రూ.13,001, కనిష్ఠ ధర రూ.8,211 పలికింది. కాగా ఇతర మార్కెట్‌లలో క్వింటాకు గరిష్ఠ ధర రూ.18 నుంచి రూ.19 వేలకు పైగా పలుకగా, ఇక్కడ మాత్రం ఒక్క కూటుకే రూ.15వేల వరకు ధర పెట్టి, మిగిలిన కూట్లన్నింటికీ రూ.12 నుంచి రూ.13వేల వరకు మాత్రమే ధర పెట్టి, తమను మోసగించారంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ కార్యాలయం వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. మానుకోట, వరంగల్, ఖమ్మం మార్కెట్‌లలో మిర్చికి ఎక్కువ ధర పలికిందని, ఇక్కడ మాత్రం వ్యాపారులు సిండికేట్‌గా మారి తక్కువ ధర వేశారంటూ ఆరోపించారు. తమకు న్యాయం చేసే వరకు ఇక్కడి నుంచి కదలబోమన్నారు. దీనిపై సమాచారం అందుకుని ఘటనా స్థలికి చేరుకున్న డీఎంఓ వెంకట్‌రెడ్డి.. రూరల్ సీఐ సర్వయ్య, స్పెషల్‌గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వర్‌రావుతో కలిసి రైతుసంఘం నాయకులు, రైతులు, వ్యాపారులతో చర్చలు జరిపారు. మిర్చిలో నాణ్యత లేకపోవడం వల్లే ధర తగ్గిందని వ్యాపారులు చెప్పగా.. కావాలనే ధర అమాంతం తగ్గించారని రైతులు పేర్కొన్నారు. చివరకు రైతుల డిమాండ్ మేరకు ఒక్కోకూటును పరిశీలిస్తూ రూ. వందల నుంచి రూ. వెయ్యి వరకు ధర పెంచారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

విత్తన ఎంపిక నుంచే జాగ్రత్త వహించాలి

- వరంగల్ ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ ఉమారెడ్డి



మాట్లాడుతున్న వరంగల్ ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ ఉమారెడ్డి

మహబూబాబాద్ రూరల్ : రైతులు ఆర్థిక అభివృద్ధి సాధించాలంటే విత్త ఎంపిక నుంచే జాగ్రత్త వహించాలని వరంగల్ ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ రావుల ఉమారెడ్డి అన్నారు. గ్రామీణ కృషి అనుభవ పథకంలో భాగంగా బుధవారం మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి శనిగపురంలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమారెడ్డి మాట్లాడుతూ రైతులను సమీకృత వ్యవసాయం ద్వారా అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని, రైతు ఒకే పంట మీద ఆధారపడకుండా చూడాలని వివరించారు. రైతులు సంఘటితంగా ఏర్పడి విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా అభివృద్ధి సాధించాలని సూచించారు. విద్యార్థులు ఉద్యోగంలో కాకుండా ప్రోత్సాహక పద్ధతులతో రైతులను చైతన్యం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల ఏడీ ఇన్‌చార్జ్ వెంకటరెడ్డి, శాస్త్రవేత్తలు శరత్ చంద్ర, అర్చన, సౌజన్య, మల్యాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి, డాక్టర్ ఎన్.కిశోర్ కుమార్, ఏఈఓ తిరుపతిరెడ్డి, ఏఈఓ రాజ్యలక్ష్మి, స్థానిక కౌన్సిలర్ బానోత్ హరిసింగ్ పాల్గొన్నారు.